క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన బండారి శ్రీనివాసులుకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.21 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు సోమవారం బాధితుడికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జల్లెల శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, నాయకులు తిరుపతి, చెన్నయ్య, గణేశ్, అంజయ్య, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కంఠమహేశ్వస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు యాదయ్యగౌడ్, శ్రీరాములుగౌడ్, శంకరయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, కేశవులుగౌడ్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెంచీలు, పుస్తకాల వితరణ



బెంచీలు, బుక్స్ అందజేసిన దాత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉద్యోగి అండగా నిలిచారు. తాతయ్య నానమ్మలు రాంచంద్రా రెడ్డి- రామనుజమ్మ జ్ఞాపకార్థం ఎల్మినేడు గ్రామానికి చెందిన మంచిరెడ్డి వెంకట్‌రామి రెడ్డి, కూతురు మంచిరెడ్డి జయశ్రీలు.. హరిజన వాడ పాఠశాలకు బెంచీలు, నోటు పుస్తకాలు, డైరీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత జయశ్రీకి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా ఏటా ఏదో రూపంలో పాఠశాలకు వారు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఎంఈఓకు సమ్మె నోటీస్ అందిస్తున్న నాయకులు, కార్మికులు

కందుకూరు: ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని తెలియజేస్తూ సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ నర్సింహకు, ఉపాధిహామీ ఎఫ్ఏలు ఏపీఓ రవీందర్‌రెడ్డికి సోమవారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా కార్మికులు కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు ప్రభావతి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేస్తున్న దాత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి హీర్యానాయక్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు వలబోజు క్రాంతి కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐడీ కార్డులు, బెల్టు, టైలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు లకుమల్ల కిరణ్‌కుమార్, సలువాల నర్సింహ, ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్, ప్రవీణ్‌కుమార్, ప్రదీప్, వంశీ, సీఆర్‌పీలు అశోక్ తదితరులు పాల్గొన్నారు

ప్రతిపాదనలకే పరిమితం

- కలగా మిగిలిన మినీస్టేడియం
- నిరుత్సాహంతో క్రీడాకారులు



ఇరుకైన స్థలంలో ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)

ఆమనగల్లు: మినీ స్టేడియం నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణంలో క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైంది. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచిస్తూ.. క్రీడాస్థలం ఏర్పాటు చేస్తామన్న పాలకుల హామీలు నీటిమీది రాతలుగా మారాయి. దీంతో స్టేడియం కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్న క్రీడాకారులకు అది కలగానే మిగిలింది.

పొలాల్లో పోటీలు..

వేసవి సెలవుల్లో పట్టణాలు, గ్రామాల్లో టోర్నీలు నిర్వహించడం సహజం. కానీ ఆమనగల్లు పట్టణంలో సరైన ఆటస్థలం లేక.. సమీపంలోని అయ్యప్ప కొండ వద్ద పొలాల్లో నిర్వాహకులు పోటీలను నిర్వహిస్తున్నారు. ఎలాంటి సౌకర్యాలు, శిక్షణ లేకుండా పోటీల్లో పాల్గొంటే ప్రయోజనం ఏముంటుందని పలువురు ఆటగాళ్లు వాపోతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించి, మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా స్టేడియం ఏర్పాటు చేయాలని.. ఆమనగల్లు బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి, స్టేడియం నిర్మించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

స్టేడియం నిర్మించాలి



పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి. చాలాకాలంగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో సరైన ఆటస్థలం, శిక్షణ లేక క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా.. చాలా మంది యువతీయువకులు ఆటలకు దూరం అవుతున్నారు. స్టేడియం నిర్మాణానికి ప్రజాప్రతినిదులు, అధికారులు చొరవ చూపాలి. క్రీడాకారులను ప్రోత్సహించాలి.

– రామ్మోహన్, అధ్యక్షుడు, ఆమనగల్లు బ్యాడ్మింటన్ క్లబ్

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాలులో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతమయ్యేలా చురుగ్గా పనిచేయాలని సూచించారు. వాటి గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ఇన్‌చార్జీలు రాంచంద్రరెడ్డి, అరవింద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు దయసాగర్‌రెడ్డి, బాలకోటి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేశ్, అభినవ్‌రెడ్డి, అనిల్‌గౌడ్, షాబుద్దీన్ పాల్గొన్నారు.

బుగ్గయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం

మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత పాలకూర్ల బుగ్గయ్యగౌడ్ మండల అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో బుగ్గయ్యగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబీకులకు పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పని చేసిన జంగయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. సోమవారం సింగంపల్లిలో జంగయ్య పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట రమణారెడ్డి, జగన్, అనంతరెడ్డి, బాబా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవ పనుల పరిశీలన

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు బిజీగా ఉన్నారు. లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ భూములు, వెంచర్లలోని గ్రామ పంచాయతీ 10 శాతం భూముల్లో, జాతీయ గ్రామీణ ఉపాధిపథకం కింద మొక్కలు నాటేందుకు వీలుగా, ఉపాధి కూలీలతో గోతులు తీయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఎంపీడీఓ సుజాత వనమహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈజీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, సిబ్బంది, కూలీలు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుజాత

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం యాచారం మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ.. అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని పేర్కొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

కందుకూరు: తమ గ్రామంలో శ్మశానవాటిక స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామస్తులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారి వద్దకు వచ్చిన తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో కొద్దిపాటి స్థలంలో ఉన్న శ్మశానవాటిక సరిపోక అవస్థలు పడుతున్నామన్నారు. 30 ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాల్లో వైకుంఠ ధామాలు నిర్మించినా, ఇక్కడ స్థలం లేక నిర్మించలేదన్నారు. దీంతో ఎవరైనా మృతి చెందితే ఖననం చేయడానికి నానాపాట్లు పడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ భూమిని కేటాయించి సమస్య పరిష్కరించాలని కోరారు. మాజీ సర్పంచ్ డేరంగుల జంగయ్య, గ్రామస్తులు రావిచెట్టు వెంకటయ్య, డేరంగుల విఠల్, డి.శ్రీరాములు, డి.సత్యానారాయణ, డి.నగేశ్, డి.జంగయ్య, ఎం.యాదయ్య, ఎండీ ఖాసీం, కె.రాజు, కె.శేఖర్, డి.దర్శన్, ఆర్.జైపాల్, పి.సత్తయ్య, డి.లక్ష్మయ్య, డి.కిష్టయ్య, మల్లేష్, డి.శ్రీను, డి.యాదగిరి, డి.జంగయ్య, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకుంటున్న రైతులు

మాడ్గుల: పట్టా పాస్ పుస్తకం కలిగిన రైతులు.. ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని అరుణకుమారి తెలిపారు. సోమవారం నాగిళ్ల గ్రామం రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా.. పట్టదారు పాస్ పుస్తకం కలిగిన రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసి, 14 అంకెల ఫార్మర్ ఐడీని కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఆధార్ కార్డు, దానికి అనుసంధానం అయిన ఫోన్ నంబర్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

బడుగుల పక్షాన నిరంతర పోరాటం



మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మంచాల: ప్రజా పోరాటాలతోనే మార్పు సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో ఆ పార్టీ 10వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజా సమస్యలు ఉన్నన్ని రోజులు ఎర్ర జెండా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడి నేటికీ వందసంవత్సరాలు గడిచిందని, దేశంలో అనేక ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. భవిష్యత్‌లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తుందని చెప్పారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి మరో పోరాటం చేయక తప్పదన్నారు. పార్టీ మండల కార్యదర్శి బురుగాల గాలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజ్ రవీంద్ర చారి, కావలి నర్సింహ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరిగంటి యాదయ్య, జిల్లా నాయకులు నీలమ్మ, నర్ల శ్రీశైలం యాదవ్, రాజు నాయక్, గాలయ్య, అలీమొద్దీన్, అనంతరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రత కార్డులు ఇవ్వాలి

మంచాల: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం కొత్తగా ఆరోగ్య భద్రత కార్డులు ఇవ్వాలని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మంచాల మండలం ఆగాపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త ఆరోగ్య భద్రత కార్డులు అందించి, అన్ని వైద్యశాలల్లో ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందించాలని కోరారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీని అమలు చేసి, పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలని కోరారు. టీచర్ల సమస్యలపై పోరాటం చేస్తున్న సంఘం.. సభ్యత్వ నమోదును విస్తృతంగా చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ మండల శాఖ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, మండల నాయకులు ఐలయ్య, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.



టీచర్లకు సభ్యత్వం అందజేస్తున్న తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

జీఓ 282ను రద్దు చేయాలని నిరసన

ఇబ్రహీంపట్నం: శ్రమ దోపిడీకి గురిచేసే జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ఆ జీఓ ప్రతులను కాల్చి, మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తుందని మండిపడ్డారు. 150 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 43 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలను మారుస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం 8 గంటల పని దినాలను 10 గంటలకు పెంచారన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు పగడాల యాదయ్య, చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, ఎల్లేశ్, జగన్, బుగ్గరాములు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



జీఓ ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలు, చేయూత పెన్షన్ దారులకు రూ.4 వేలు, కండరాల క్షీణత గల వారికి రూ.15 వేలు పెంచాలని కోరుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాగార్జున, శ్రీనివాస్‌చారి, నర్సింహగౌడ్, కొమ్ము రాములు, పాండు, డేరంగుల ఈశ్వర్, రమావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌కు సన్మానం

కందుకూరు: ప్రమాణ స్వీకారానికి అమెరికా వెళ్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఏ నూతన గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, దీపారెడ్డి దంపతులను క్లబ్ ముఖ్య నాయకులు సోమవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం ఓర్లాండోలో జరగనున్న 107వ లయన్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కోసం వారు తరలివెళ్లనున్నారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమెరికాలో మహేంద్రకుమార్‌రెడ్డి సెరిమోనియస్‌గా ప్రమాణస్వీకారం చేసి వచ్చిన తర్వాత జిల్లాను విజయపథంలో నడిపించాలని కోరారు.



డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న క్లబ్ ముఖ్య నాయకులు

ఆత్మగౌరవానికి ప్రతీక ఎమ్మార్పీఎస్

- మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే వర్గీకరణ
- సమితి ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు



కడ్తాల్: ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

మంచాల: దళితుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఎమ్మార్పీఎస్ నిలిచిందని సమితి జిల్లా నాయకుడు ఏర్పుల మల్లేశ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో సమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళితుల ఆత్మగౌరవం కోసం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ఆయన పోరాట ఫలితమే ఆరోగ్య శ్రీ పథకానికి మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఏనేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘకాలం ఉద్యమించి, సాధించారని చెప్పారు. సమితి మండల అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమితి నాయకులు శంకర్, సురేష్, జంగయ్య, యాదయ్య, రాజు, నాగరాజు, గాలయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సమితి నాయకులు ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి మండల అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని తెలిపారు. సమితి నాయకులు రాంచందర్, మైసయ్య, కిరణ్, సమితి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సమితి నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలో సమితి మండల అధ్యక్షుడు రమేశ్‌మాదిగ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా ముద్విన్ గ్రామంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లపల్లి లక్ష్మయ్య జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లపల్లి లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, మండల అధ్యక్షుడు రమేశ్‌మాదిగ, ఉపాధ్యక్షుడు నరేశ్, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్, మహేశ్, నాయకులు మంకిశ్రీను, ముత్తికృష్ణ, రమేశ్, ఒగ్గు మహేశ్, కాలే వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా సమితి నాయకులు సంబురాలు చేసుకున్నారు. జెండాలను ఆవిష్కరించి, కేక్ కట్ పంపిణీ చేశారు. సమితి మండల అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో అంబేడ్కర్ కూడలి వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సమితి నాయకులు సాయిలు, అంజయ్య, కృష్ణ, సంజీవ, అశోక్, అనిల్, నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు



యాచారంలో.. సమితి నాయకుల సంబురాలు



మంచాలలో..